విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొ. లింబాద్రి

రాంనగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి సూచించారు. శనివారం విద్యానగర్‌లోని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.ప్రభు అధ్యక్షతన పదవ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ అధికారులు ప్రొఫెసర్ యాదగిరి, ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్, జాయింట్ డైరెక్టర్లు, అకడమిక్ గైడెన్స్ అధికారి ప్రొఫెసర్ బాలభాస్కర్, అధ్యాపకులు రాజేందర్, రామచంద్రం పాల్గొన్నారు.

మున్సిపల్ స్టడీటూర్‌కు కార్పొరేటర్ పావని


ఎయిర్‌పోర్టులో కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఫస్ట్ ర్యాంక్ కైవసం చేసుకుంటున్న ఇండోర్ తరహాలో హైదరాబాద్‌ను తీర్చిదిద్దే ఉద్దేశంతో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో స్టడీటూర్‌కు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ శనివారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి గౌహతి నగరానికి బయలుదేరి వెళ్లారు. ఆమెతో పాటు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ వెళ్లారు. పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇండోర్, లక్నో, అస్సాం, గౌహతి, షిల్లాంగ్ నగరాలను సందర్శించి అక్కడి స్థానిక సంస్థలు అనుసరిస్తున్న విధానాలపై స్టడీ చేస్తామన్నారు.

సాంస్కృతిక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా శ్రీలక్ష్మీనగర్ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే సాంస్కృతిక, సాహితీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ చైర్మన్, త్యాగరాయగానసభ మాజీ ప్రధాన కార్యదర్శి వైఎస్‌ఆర్ మూర్తి తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. అక్టోబర్ 10న జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని.. వివరాలకు 9849569626 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాపునగర్‌లో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ బాపునగర్‌లో తరచూ వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాపునగర్‌తో పాటు అశోక్‌నగర్ వాటర్‌ట్యాంక్ లేన్‌పక్క గల్లీ, టెలికం ఆఫీస్ నుంచి హిమాయత్‌నగర్ వై జంక్షన్‌కు వెళ్లే రోడ్డు, అక్కడి నుంచి అశోక్‌నగర్ సర్కిల్ వరకు దాదాపు పది వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రిపూట రోడ్డుపై నడవాలంటే భయంగా ఉందని మహిళలు, వృద్ధులు వాపోతున్నారు. వాహనదారులు హెడ్‌లైట్లతో వెళ్తుంటే చీకట్లో తమకు ఏమీ కనిపించక కింద పడిపోతున్నామని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరద నీటిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన జీహెచ్‌ఎంసీ ఉద్యోగి


వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేష్‌ను సన్మానించిన జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్‌చారి

ముషీరాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): వరద నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న వ్యక్తిని జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాపాడారు. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ముషీరాబాద్ డివిజన్‌లోని వైఎస్‌ఆర్ పార్కు వీధికి వెళ్లే మార్గంలో వరద నీరు రోడ్డుపై పెద్ద ఎత్తున ప్రవహిస్తున్నది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేష్, ఇద్దరు కార్మికులు మహేష్, శ్రీను వరద నీటిలో నుంచి ఎవరూ వెళ్లకుండా సూచనలు చేస్తూ కాపలాగా ఉన్నారు. అదే సమయంలో రామాలయం నుంచి వైఎస్‌ఆర్ పార్కు వైపు వెళ్లేందుకు ద్విచక్రవాహనదారుడు జీహెచ్‌ఎంసీ సిబ్బంది సూచనలు పట్టించుకోకుండా వెళ్లేందుకు ప్రయత్నించాడు. ప్రవాహం తాకిడికి అతడు కొట్టుకుపోతుండడంతో గమనించిన నాగేష్ కాపాడాడు. వాహనాన్ని సైతం వర నీటి నుంచి బయటకు తీశారు. విషయం తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్‌చారి, డీఈలుసన్నీ, గీతాకుమారీ నాగేష్‌ను శనివారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సన్మానించారు.

హస్తకళలు, చేనేత ఎగ్జిబిషన్‌కు మంచి ఆదరణ


చీరలను పరిశీలిస్తున్న మహిళలు

కవాడిగూడ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్టేడియంలో డ్వాక్రా మహిళలు, చేనేత కార్మికులు, హస్తకళల కార్మికుల ఆధ్వర్యంలో తయారు చేసిన వస్తువులను శ్రీ సాయి చేనేత కాటన్ అండ్ సిల్క్ ఎక్స్‌పో పేరిట ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు ఆదరణ పెరుగుతోంది. ఉత్పత్తి ధలరకే వస్తువులు, చేనేత వస్త్రాలు, హస్తకళాకారులు తయారు చేసిన బొమ్మలు లభించడంతో వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గత నెల 22 నుంచి ఈ నెల 29 వరకు కొనసాగే ఎగ్జిబిషన్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు వందకు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో కొండపల్లి, ఏటికొప్పాక, చెక్క బొమ్మలు, హైదరాబాద్ మంచి ముత్యాలు. సారంగపూర్ ఉడేన్‌వేర్, బ్లాక్ మెటల్, వైట్ మెటల్, వెండి, పూజా వస్తువులకు మంచి ఆదరణ లభిస్తున్నట్లు నిర్వాహకులు పద్మజ తెలిపారు. హస్తకళాకార్మికులు తయారు చేసిన వస్తువులను మార్కెట్ ధరకంటే తక్కువకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.

బద్దుల సత్యనారాయణయాదవ్ మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సేవకుడు బద్దుల సత్యనారాయణయాదవ్(94) గుండెపోటుతో మృతిచెందారు. శనివారం కాచిగూడ నింబోలిఅడ్డలోని తన నివాసంలో ఆయన మృతిచెందారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు.

అంబేడ్కర్ కళాశాలలో శాంతి దినోత్సవం

రాంనగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బ్రహ్మకుమారీస్ సీనియర్ ఫ్యాకల్టీ వసంత లక్ష్మి సూచించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ కళాశాలలో అంతర్జాతీయ శాంతి దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి దేశాలన్నీ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21న అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని అహింస, శాంతి, సోదరభావాల సాధన కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ శాంతి కోసం వ్యక్తులు, సంస్థలు, విద్యార్థులు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్


ట్యాంక్‌బండ్ జలదృశ్యం వద్ద బాపూజీకి నివాళులర్పించిన బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు


బాపూజీ విగ్రహానికి నివాళులర్పించిన టీడీపీ నేత పి.సాయిబాబా

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

రాంనగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ కొనియాడారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా శనివారం ట్యాంక్‌బండ్ జలదృశ్యం వద్ద గల లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఆయన నివాళులర్పించి మాట్లాడారు. బాపూజీ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

పద్మశాలి ప్రజాసంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో..

చిక్కడపల్లి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి ప్రజాసంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో శనివారం అశోక్‌నగర్ చౌరస్తాలో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ నేతలు ముఠా జైసింహ, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు శంకర్, జాన్ కెన్నడీ, అభిషేక్ కెన్నడీ, ముదారి పురుషోత్తం, మారిశెట్టి నర్సింగ్‌రావు, గుండు జగదీష్‌బాబు, సురేష్‌కుమార్, తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్, పద్మశాలి ప్రజాసంఘం ముషీరాబాద్ నియోజకవర్గం నాయకులు ఎయిర్‌టెల్‌రాజు, పున్న సత్యనారాయణ తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

బాపూజీకి భారతరత్న ప్రకటించాలి..

నల్లకుంట, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనను ఎదురించి పోరాటం చేయడంతో పాటు ఏడవ నిజాంపై బాంబు దాడి చేసి ఉద్యమ ఉధృతిని పెంచిన తెలంగాణ పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని అంబర్‌పేట నియోజకవర్గ పద్మశాలి సంఘం నాయకులు కోరారు. సంఘం ఆధ్వర్యంలో శనివారం లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని శివం రోడ్డులోని న్యూఆజాం కాంప్లెక్స్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి సంఘం నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, అధ్యక్షుడు వర్కాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలుక శివకుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్, ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, గంగిశెట్టి సత్తయ్య, సలహాదారులు నక్క రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీస్ పెద్దబొమ్మ మధుసూదన్, తీగల నరేందర్, బాగ్‌అంబర్‌పేట డివిజన్ సంఘం అధ్యక్షుడు కడిగె శ్రీనివాస్, ఇడెం యాదగిరి, మహిళా నాయకురాలు భోగ నీరజ పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ సేవలు దేశానికే ఆదర్శం..

రాంనగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆత్మగౌరవం, జాతీయ స్వేచ్ఛ కోసం పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు దేశానికే ఆదర్శం అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. శనివారం ట్యాంక్‌బండ్ వద్ద బాపూజీ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్.ప్రకాష్, భానుప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


రాంనగర్‌లో నివాళులర్పించిన పద్మశాలి సంఘం ప్రతినిధులు అతినగరం సుధేష్, మంతెన దశరథ్, బోనం ఊర్మిళ తదితరులు


ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అంబర్‌పేట నియోజకవర్గ పద్మశాలి సంఘం నేతలు


నివాళులర్పిస్తున్న సత్యనారాయణ, సూర్యపల్లి రవికుమార్, బాపూజీ ముఖ్య అనుచరుడు అమృత్‌కుమార్ జైన్ తదితరులు

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం


కవాడిగూడలో వర్షానికి నిలిచిపోయిన నీరు. ఇబ్బందులకు గురైన వాహనదారులు


బాకారంలో వరద నీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి


ముషీరాబాద్ సాగర్‌లాల్ చౌరస్తాలో నిలిచిన వరద నీరు

రాంనగర్, ముషీరాబాద్, నల్లకుంట, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో శుక్రవారం రాత్రి, శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని అంజయ్యనగర్, నాగమయ్యకుంట బస్తీలలోకి వర్షం నీరు రావడంతో జలమయమయ్యాయి. ఆ బస్తీలోని పలు ఇళ్లలోకి వర్షం నీరు చేరి వస్తువులు తడిసిముద్దయ్యాయి. అంజయ్యనగర్‌లో నిలిచిన వర్షం నీటిని బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పి.సాయికృష్ణయాదవ్, శేషసాయి తదితరులు పరిశీలించి బాధితులకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముషీరాబాద్ సాగర్‌లాల్ ఆస్పత్రి, ఆజామాబాద్, వీఎస్టీ, అశోక్‌నగర్, కవాడిగూడ చౌరస్తాలో వర్షానికి నిలిచిపోయిన నీటితో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని ఛేనెంబర్ చౌరస్తా, తిలక్‌నగర్ చౌరస్తా, అలీకేఫ్ చౌరస్తా, నల్లకుంట నర్సింహ బస్తీలలో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న వేముల వెంకటేష్

ట్యాంక్‌బండ్‌పై ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పై వడ్డెరజాతి యోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే నేటి తరానికి ఆదర్శంగా ఉంటుందన్నారు. వడ్డెర జాతి ముద్దుబిడ్డ ఓబన్న సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల లక్ష్మీకాంతయ్య, ఆలకుంట్ల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో కూడికల సమావేశాన్ని అడ్డుకోవాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ క్రాస్ రోడ్‌లోని హెబ్రోన్ చర్చిలో ఈ నెల 24న దైవసేవకుల కూడికల సమావేశాన్ని నిలిపివేయాలని కోరుతూ క్రైస్తవ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుసలేము మత్తయ్య రాష్ట్ర డీజీపీ, సీపీ, సెంట్రల్ జోన్ డీసీపీలకు విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం గోల్కొండ క్రాస్‌రోడ్‌లో మత్తయ్య విలేకరులతో మాట్లాడారు. చర్చి బోగస్ ట్రస్ట్ కమిటీ సభ్యులు చర్చిలో అలజడి సృష్టించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సమావేశాన్ని నిలిపివేసి కమిటీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని మత్తయ్య పోలీసులను కోరారు.

చికిత్స పొందుతూ 14 నెలల చిన్నారి మృతి

రాంనగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో ఆస్పత్రికి వచ్చిన 14 నెలల చిన్నారి చికిత్స పొందుతూ మృతిచెందింది. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన దంపతులు తమ చిన్నారికి 3 రోజులుగా జ్వరం తగ్గకపోవడంతో తిలక్‌నగర్‌లోని పిల్లల ఆస్పత్రికి శనివారం తీసుకువచ్చారు. చిన్నారిని పరీక్షించిన వైద్యులు చికిత్స ప్రారంభించగా గంట తర్వాత మృతిచెందింది. దీంతో బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. దీనిపై ఆస్పత్రి యాజమాన్యం వివరణ ఇచ్చింది. చికిత్స జరుగుతున్న సమయంలో పాలు పట్టడంతో శ్వాస ఆగిపోయిందని పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



రాంనగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితంలేని వ్యక్తి అదృశ్యమైన ఘటన ముషీరాబాద్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. భోలక్‌పూర్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడు డి.ప్రభాకర్(58)కు మతిస్థిమితం సరిగ్గా ఉండడం లేదు. ఈ నెల 17న గణేష్ నిమజ్జనం కోసం బయటకు వచ్చిన ప్రభాకర్ తిరిగి ఇంటికి వెళ్లలేదు. అతడి కుమారుడు సతీష్ శనివారం ముషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు 81066 22815 నెంబర్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ప్రేమ్‌కుమార్ కోరారు.


మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న శంకర్, నర్మెట్ట మల్లేష్

స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాలని మంత్రికి వినతి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ ఎస్‌ఆర్‌టీ, టీఆర్టీ క్వార్టర్స్ ఇండస్ట్రియల్ కాలనీలో అదనపు స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 70 సంవత్సరాలుగా తమ నివాసాల పక్కన ఉన్న ఖాళీ స్థలాలను కాపాడుకుంటూ వస్తున్నామని ప్రభుత్వం విడుదల చేసిన జీవోలు 58, 59 ప్రకారం తమకు డిమాండ్ నోటీసులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు కాలనీవాసులు శనివారం రాజీవ్ గాంధీ నగరపాలిక సంఘటన్ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ గుర్రం శంకర్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు కెన్నడీ రాజు, అభిషేక్ కెన్నడీ ఉన్నారు.

సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టాలి

రాంనగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): భూగోళం మీద యుద్ధాలు, సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టి శాంతి నెలకొల్పేందుకు యువతరం ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్సీ కె.యాదవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రచయిత కె.వి.ఎల్. ఆధ్వర్యంలో ప్రపంచశాంతికవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి యాదవరెడ్డితో పాటు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ అధ్యక్షుడు అధ్యక్షుడు పి.సుధాకర్, సభ్యులు జి.రఘుపాల్ హాజరై మాట్లాడారు. కవులకు సమాజాన్ని మార్చగలిగే శక్తి ఉందని వారు అన్నారు. గోపాల్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

23 నుంచి జాతీయ ప్రొఫెషనల్ కాంపిటీషన్స్

నల్లకుంట, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యానగర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో తృతీయ జాతీయ ప్రొఫెషనల్ కాంపిటీషన్, ద్వితీయ నేషనల్ బిడ్డింగ్ చెఫ్ కాంపిటీషన్ పోటీలను ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాక్‌టెయిల్ తయారీ, పూల అమరిక, చక్కదనం, కళాత్మకత, పూల ప్రదర్శన, పర్యావరణ అనుకూల హోటల్ అభ్యాసాల కోసం గ్రీన్ ఇన్నోవేషన్స్ వంటి పోటీలు ఉంటాయన్నారు.

జీవో 25 అమలు సరికాదు: యూఎస్‌పీసీ

కవాడిగూడ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): జీవో 25 అమలు చేయాలని పాఠశాల విద్యా సంచాలకులు ఆదేశించడాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఖండించింది. ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 60 మందికి సైతం ఇద్దరినే కేటాయించాలని పేర్కొనడం సరికాదన్నది. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా 40 మంది విద్యార్థులకు ఇద్దరు, 60 మందికి ముగ్గురు చొప్పున ఉండాలని ప్రభుత్వానికి సూచించింది. ఉపాధ్యాయుల సర్దుబాటు ద్వారా బదిలీ అయిన ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.


సామూహిక నిరాహార దీక్షలో మాట్లాడుతున్న థామస్‌రెడ్డి

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కవాడిగూడ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీఎస్‌ఆర్టీసీ జాయింట్‌యాక్షన్ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో జేఏసీ చైర్మన్ ఇ.వెంకన్న, వైస్‌చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కె.యాదయ్య, ఎస్.సురేష్, బి.యాదగిరితో పాటు జేఏసీ నేతలు ఇందిరాపార్కు వద్ద జరిగిన సామూహిక నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, వెల్ఫేర్ కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడే ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు మహిళా కండక్టర్లు, డ్రైవర్లు గ్యారేజీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

రైల్వే ప్రయాణికులకు సైబర్ భద్రతపై అవగాహన


కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వే స్టేషన్‌లో లెర్నింగ్ లింగ్స్ ఫౌండేషన్ డెల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ, సైబర్ భద్రతపై రైలు ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, రిసాలబజార్, బొల్లారానికి చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రయాణికులు తమ వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని, అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దని సూచించారు.

'తిరుమల పవిత్రతను జగన్ మంటగలిపారు'


జంగం దశరథ్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంటగలిపారని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ ఆరోపించారు. శనివారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నంతకాలం అరాచకాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. వెంకన్న భక్తుల ప్రశ్నలకు జగన్‌మోహన్‌రెడ్డి జవాబు ఇవ్వకపోవడం వెనుక ఏదో మతలబు ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. తిరుపతి లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు, చేప నూనె ఉన్నట్లు నివేదికలు తేల్చాయని, నిర్వాకంపై ఏపీ సీఎం చంద్రబాబునాయుడు విచారణకు ఆదేశించడం పట్ల దశరథ్ హర్షం వ్యక్తం చేశారు.


తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా నియమితులైన రిటైర్డ్ ఐఏఎస్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.జి.గోపాల్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శనివారం ఆయన కార్యాలయంలో కె.రాజేష్, ఆలూరి చక్రవర్తి, మూర్తి, డి.సుధాకర్‌శర్మ, సీహెచ్. మురళీకృష్ణ, పి.సీతారామయ్య, వి.శ్రీనివాస్, కృష్ణ తదితరులు ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి



సాహిత్య పురస్కారాల ప్రదానం

తాటికొండాల నరసింహారావు, వంశీకృష్ణల ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కథా రచయిత, నాటక ప్రయోక్త, పరిశోధకుడు తాటికొండాల నరసింహారావు సతీమణి భ్రమరాంబ సాహిత్య పురస్కారాల ప్రదానం జరిగింది. తెలుగు యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ ఎన్.గోపి, ప్రసేన్‌లకు 2003, 2004 పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నందిని సిధారెడ్డి, నరసింహారెడ్డి, గౌరీశంకర్, సీతారాం, యాకూబ్, ఆనందాచారి, గుడిపాటి వెంకట్, ఎస్.రఘు తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

సీతారాం ఏచూరికి నివాళి


సీతారాం ఏచూరికి నివాళులర్పించిన శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు తదితరులు

ముషీరాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సీతారాం ఏచూరి భారత రాజకీయాలలో చెరగని ముద్ర వేశారని బీఆర్‌ఎస్ ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ముషీరాబాద్‌లో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో ప్రజల పక్షాన తన గళాన్ని వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. విద్యార్థి దశనుంచే పోరాట పటిమను అలవర్చుకొని ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శంకర్‌గౌడ్, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను కోల్పోయిన బాలికకు సీఐ భరోసా

చిక్కడపల్లి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన నాగమయ్యకుంటకు చెందిన 13 సంవత్సరాల బాలిక సబీరా బాగోగులను వయసు మళ్లిన ఆమె తాత చూసుకుంటున్నాడు. దీనిని గమనించిన చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య ఆమెకు సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. ఈ మేరకు లక్డీకాపూల్‌లోని చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ వారికి విషయం తెలియజేయడంతో వారు సబీరాను తమ వెంట తీసుకెళ్లినట్లు ఇన్‌స్పెక్టర్ సీతయ్య వివరించారు. సబీరా విద్యాభ్యాసం, యోగక్షేమాలు కమిటీ వారు చూసుకుంటారని ఆయన పేర్కొన్నారు.

ముగ్గురు రైల్వే దొంగలకు జైలు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురికి రైల్వే కోర్టు శిక్షలు విధించింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ షాహీన్ నగర్‌కు చెందిన అజాజ్ కుమారుడు సయ్యద్ ఆయాస్(23), ఫలక్‌నుమా-ఉందానగర్ రైల్వే స్టేషన్ల నడుమ ఎంఎంటీఎస్ రైల్లో ప్రయాణికుడికి కత్తి చూపించి సెల్ ఫోన్, నగదు లాక్కొని పారిపోయాడు. ఈ కేసుకు సంబంధించి రైల్వే కోర్టు శనివారం నిందితుడికి 14 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించింది. మరో సెల్ ఫోన్ దొంగతనం కేసులో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు మాచర్ల తిమ్మప్ప(26), ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన రామకృష్ణ కుమారుడు దుప్పలపూడి సాయిరాఘవ(24) లకు ఆరు నెలల శిక్ష విధించింది. ముగ్గురు నిందితులను జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు,